కాంగ్రెస్‌తో పొత్తు ఉండదు

- కేజ్రీవాల్ పునరుద్ఘాటన

న్యూఢిల్లీ : ఢిల్లీలో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తాము కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని ఆమాద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ మరోమారు చెప్పారు. ఈ మేరకు బుధవారం సామాజిక మాధ్యమాల్లో ఆయన పోస్టు చేశారు. వచ్చే ఎన్నికల్లో ఆమాద్మీ పార్టీ తన సొంత బలంతోనే బరిలోకి దిగుతుందని అని పునరుద్ఘాటించారు. కాగా, అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఆప్ పార్టీ రెండు విడతలుగా అభ్యర్థుల జాబితాను విడుదల చేసిన సంగతి తెలిసిందే.

పంజాబ్, హర్యానాల్లో ఎన్ఐఎ సోదాలు

న్యూఢిల్లీ : జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో బుధవారం సోదాలు నిర్వహించింది. స్థానిక రౌడీ మూకలకు ఉగ్రవాదులకు మధ్య సన్నిహిత సంబంధాలున్నాయనే అభియోగాలకు సంబంధించిన కేసు (గ్యాంగ్‌స్టర్– టెర్రర్ నెక్సస్ కేసు) దర్యాప్తులో భాగంగా ఈ సోదాలు చేపట్టారు. పంజాబ్‌లో 8 ప్రదేశాల్లో, హర్యానాలో ఒక చోట ఎన్ఐఎ ఈ సోదాలు నిర్వహించింది. కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు ఎన్ఐఎ దర్యాప్తు కొనసాగిస్తోంది. పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో టెర్రర్ గ్యాంగ్‌స్టర్ దవీందర్ బాంబిహా సిండికేట్ సహచరులతో సంబంధమున్న వారి ఇళ్లల్లోనూ ఎన్ఐఎ గత నెలలో సోదాలు నిర్వహించిన సంగతి తెలిసిందే.

సిసోడియాకు ఊరట

న్యూఢిల్లీ : ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియాకు మద్యంపాలసీ కేసులో సుప్రీంకోర్టు భారీ ఊరట కల్పించింది. ఈ కేసులో ఆయనకు విధించిన బెయిల్ షరతులను సడలించింది. ఈమేరకు బుధవారం సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. సిసోడియా ఇకపై వారంలో రెండుసార్లు దర్యాప్తు సంస్థల ఎదుట హాజరుకావాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు తెలిపింది. అయితే కేసు విచారణకు మాత్రం హాజరు కావాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. కాగా, ఈ కేసులో సీనియర్ న్యాయవాదులైన అభిషేక్ మను సింఘ్వీ, న్యాయవాది వివేక్‌జైన్ కోర్టులో సిసోడియా తరపున వాదనలు వినిపించారు. ప్రతి సోమ, గురువారాల్లో సిసోడియాకు పోలీసుల ముందు హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని వారు కోర్టును అభ్యర్థించారు. సిసోడియా ఇప్పటికే దాదాపుగా 60 సార్లు హాజరయ్యారని, ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారెవరికీ ఇలాంటి షరతు లేదని న్యాయవాదులు కోర్టులో తెలిపారు. వీరి వాదనలు విన్న జస్టిస్ కెవి విశ్వనాథన్, జస్టిస్ బిఆర్ గవాయ్‌తో కూడిన సుప్రీం ధర్మాసనం సిసోడియా బెయిల్ షరతులను సడలించింది. లిక్కర్ స్కామ్ కేసులో షరతులతో కూడిన బెయిల్‌ను కోర్టు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. వారంలో రెండు రోజులు అంటే ప్రతి సోమ, గురువారం ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య విచారణకు హాజరు కావాలని, ఆ అధికారికి రిపోర్ట్ చేయాలని షరతు ఉంది. ఇప్పుడు ఆ షరతును సుప్రీంకోర్టు సడలించింది.

కేరళపై కేంద్రం వివక్ష

(మొదటి పేజీ తరువాయి)

చేయాలన్న ఉద్దేశంతోనే ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. ఎపికి జగన్ ప్రభుత్వ హయాంలో రుణ పరిమితులు విధించని కేంద్రం, కేరళకు మాత్రం విధించిందని చెప్పారు. వయనాడ్‌లో సంభవించిన ప్రకృతి విపత్తులో వందల మంది మరణించడంతో పాటు వేలకోట్ల ఆస్తి నష్టం జరిగిందని, అయినా జాతీయ విపత్తు నిధి నుంచి కేరళ రాష్ట్రానికి కేంద్రం రూపాయి కూడా సహాయం చేయలేదన్నారు. కేరళ సహకార వ్యవస్థను ధ్వంసం చేసి సహకార రంగాన్ని తన గుప్పెట్లో పెట్టుకునేందుకు కేంద్రం నేషనల్ మల్టీస్టేట్ కో–ఆపరేటివ్ విధానాన్ని ముందుకు తీసుకొస్తోందని, దీనిని ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీలో ప్రభుత్వం చేసిన చట్టాలను ఆమోదించకుండా గవర్నర్ ద్వారా అడ్డుకుంటూ ఆ వ్యవస్థను దుర్వినియోగం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ రాజ్యాంగ వ్యతిరేక, నిరంకుశ విధానాలను ప్రతిఘటించి కేరళ ప్రజలకు సంఘీభావంగా నిలవాలని ఆయన కోరారు.

ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అన్ని రంగాల్లో కార్పొరేట్ అనుకూల, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ సంపదను అదాని, అంబానీలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కట్టబెడుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి... మోడీ, అమిత్‌షా చేతిలో తోలుబొమ్మలుగా ఉన్నారని విమర్శించారు. నూతన విద్యా విధానాన్ని అమలు చేయలేదని తమిళనాడుకు ఇవ్వాల్సిన నిధులను కేంద్రం ఇవ్వడం లేదన్నారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకాన్ని పట్టణాల్లో కూడా అమలు చేస్తున్న రాష్ట్రాల్లో కేరళ, తమిళనాడు మాత్రమే ఉన్నాయని చెప్పారు. ఈ సభలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కార్యదర్శి పి ప్రభాకర్ రెడ్డి, ఎపి కౌలు రైతు సంఘాల కార్యదర్శి ఎం హరిబాబు ప్రసంగించారు.

తివారీ అంతిమయాత్రలో పాల్గొన్న బృందాకరత్, తపన్‌సేన్, నీలోత్పల్ బసు, బి వెంకట్ తదితరులు

కార్మిక పోరాట యోధునికి తుది వీడ్కోలు

- ఢిల్లీలో ముగిసిన తివారి అంత్యక్రియలు
- బృందాకరత్, తపన్‌సేన్ ప్రభృతుల నివాళి

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

కార్మిక వర్గం కోసం జీవిత చరమాంకం వరకు పోరాడిన యోధుడు, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కెఎం తివారీకి పార్టీ కార్యకర్తలు, ప్రజలు, బంధువులు తుది వీడ్కోలు పలికారు. ఢిల్లీలో మంగళవారం మరణించిన తివారీకి బుధవారం పలువురు ఘనంగా నివాళులర్పించారు. ప్రజా సందర్శనార్థం తొలుత ఆయన భౌతికకాయాన్ని సిపిఎం ఘజియాబాద్ జిల్లా కమిటీ కార్యాలయంలోనూ, అనంతరం ఢిల్లీలోని హరికిషన్ సింగ్ సూర్జిత్ భవన్‌లోనూ ఉంచారు.

ఈ సందర్భంగా సిపిఎం, సిఐటియు, ఎఐకెఎస్, ఎఐఎడబ్ల్యుయు, ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, డిఎస్ఎంఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్, ఆర్ఎస్‌పి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు వందలాదిగా తరలివచ్చి ప్రజా ఉద్యమనేతకు నివాళులర్పించారు. ఆ తర్వాత నిగంబోధ్ ఘాట్‌కు వరకు అంతిమయాత్ర సాగింది. దారిపొడువునా ప్రజా నీరాజనాలతో ఈ యాత్ర సాగింది. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్, తపన్‌సేన్, అశోక్ ధావలే, నీలోత్పల్ బసు, కేంద్ర కమిటీ సభ్యులు కె హేమలత, మరియం ధావలే, కె రాధాకృష్ణన్ (ఎంపి), ఆర్ అరుణ్‌కుమార్, బి వెంకట్, మురళీధరన్, ఎఆర్ సింధు, ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి అనురాగ్ సక్సేనా, ఎంపి వి శివదాసన్ తదితరులు ఘనంగా నివాళులర్పించి ఉద్యమ సహచరుడికి తుది వీడ్కోలు పలికారు.

సిఐటియు, ఎఐకెఎస్ సంతాపం

తివారీ మృతి పట్ల సిఐటియు, ఎఐకెఎస్ సంతాపం తెలిపాయి. నిబద్ధత కలిగిన ఉద్యమకారుడిగా తివారీ జీవితం యువ తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నాయి. దేశ రాజధానిలో విప్లవోద్యమానికి తివారీ మరణం తీరని లోటు అని సిఐటియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.హేమలత, తపన్ సేన్, ఎఐకెఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ ధావలే, విజూ కృష్ణన్ తమ సంతాప సందేశంలో పేర్కొన్నారు.

కేరళలో 'చికెన్ ఆన్ వీల్'

- అందుబాటు ధరల్లో ఆరోగ్యకర మాంసాహారం
- కుడుంబశ్రీ మరో వినూత్న ప్రాజెక్టు ఆవిష్కరించిన వామపక్ష ప్రభుత్వం

శీతలీకరణ చికెన్ ఉత్పత్తులను ఆవిష్కరిస్తున్న మంత్రి రాజేష్

తిరువనంతపురం : ప్రజలే ముందు విధానాలతో వినూత్న పథకాలను ఆవిష్కరిస్తున్న కేరళలోని వామపక్ష ప్రభుత్వం తాజాగా 'చికెన్ ఆన్ వీల్' పేరుతో సరికొత్త ప్రాజెక్టును ప్రారంభించింది. స్వయం సహాయక సంఘాలతో ఏర్పడిన 'కుడుంబశ్రీ' ద్వారానే ఈ ప్రాజెక్టును కూడా అమల్జేయనున్నారు. ఈ పథకం కింద తాజా కోడి మాంసం, గుడ్లు, తదితర ఉత్పత్తులతో పాటు శీతలీకరించిన విలువ ఆధారిత చికెన్ ఉత్పత్తులు (చికెన్ డ్రమ్ స్టిక్స్, బోన్ లెస్ బ్రెస్ట్, చికెన్ బిర్యానీ కట్, చికెన్ కర్రీ కట్, ఫుల్ చికెన్ వంటివి) ప్రజల వద్దకే ప్రత్యేక వాహనాలు ద్వారా విక్రయించనున్నారు. మార్కెట్‌లోకి తీసుకురానున్న శీతలీకరణ మాంసాహార ఉత్పత్తులను కేరళ స్థానిక సంస్థల శాఖ మంత్రి రాజేష్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 నుంచి తాము 'కేరళ చికెన్' ప్రాజెక్టు ద్వారా ఆరోగ్యకరమైన మాంసాహారాన్ని, గుడ్లను కుడంబశ్రీ ద్వారా ప్రజలకు అందుబాటు ధరలకే అందిస్తున్నామని తెలిపారు. ఇప్పుడు 'చికెన్ ఆన్ వీల్' పేరుతో తాజా మాంసాహారాన్ని, గుడ్లను, ఫ్రోజెన్ ఉత్పత్తులను ప్రత్యేక వాహనాల ద్వారా ప్రజల చెంతకే తీసుకెళ్లే పథకాన్ని రూపొందించినట్లు తెలిపారు. ఈ పథకం కింద కుడుంబశ్రీ సభ్యులు నేరుగా పౌల్ట్రీ రైతుల వద్దకు వెళ్లి కోళ్లను, గుడ్లను సేకరిస్తారని, వాటిని కుతత్తుకులంలోని భారత మాంసాహార ఉత్పత్తుల సంస్థకు చేర్చి అక్కడ ప్రాసెస్ చేసి నేరుగా వినియోగదారులకు చేరవేస్తారని తెలిపారు. అన్ని మాంసాహార ఉత్పత్తులపై క్యుఆర్ కోడ్ ఉంటుందని, దీనివల్ల ఏ ఉత్పత్తి ఏ పౌల్ట్రీ నుంచి వచ్చిందన్న సంగతి కూడా వినియోగదారులు తెలుసుకోవచ్చునని, దీనివల్ల తాము ఆరోగ్యకరమైన మాంసాన్ని స్వీకరిస్తున్నామన్న భరోసా ప్రజలకు లభిస్తుందని తెలిపారు. తొలి దశలో త్రిసూర్, ఎర్నాకులం, కొట్టాయం, పథమిట్ట జిల్లాల్లో వీటిని విక్రయించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ అధ్యక్షురాలు పి గౌరి, సతీదేవి తదితరులు పాల్గొన్నారు. 2019లో ప్రారంభించిన 'కేరళ చికెన్' ప్రాజెక్టు కింద ఇప్పటికే 431 బ్రాయిలర్ కోళ్ల పెంపకం కేంద్రాలను నెలకొల్పారు. 11 జిల్లాల్లో 139 అవుట్ లెట్లు పనిచేస్తున్నాయి.

2035 నాటికి భారత్ సొంత అంతరిక్ష కేంద్రం

- కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ : భారత్ 2035 నాటి కల్లా తన సొంత అంతరిక్ష కేంద్రాన్ని సిద్ధం చేసుకోనుందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక, అంతరిక్ష శాఖ మంత్రి జితేంద్ర సింగ్ చెప్పారు. 2040 నాటికి చంద్రుడిపై భారతీయుడు కాలుమోపే దిశగా దేశ అంతరిక్ష రంగం ముందడుగు వేస్తోందని ఆయన తెలిపారు. ఏడాది ప్రగతిపై ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాలు చెప్పారు. 'చంద్రునిపై భారతీయ వ్యోమగామిని దింపాలనే ప్రణాళికలతో అంతరిక్ష పరిశోధనలో ప్రధాన మైలురాళ్లను సాధించడానికి సిద్ధంగా ఉంది. 2035 నాటికి భారత్ సొంత స్పేస్ స్టేషన్‌ను ఏర్పాటు చేసుకుంటుంది. అంతరిక్ష కేంద్రాలు కలిగివున్న అమెరికా వంటి దేశాల సరసన త్వరలో భారత్ నిలవనుంది' అని ఆయన తెలిపారు. అత్యంత త్వరలోనే భారత్ గగన్‌యాన్ మిషన్ చేపట్టనుందని, అలాగే తొలి మానవ సహిత డీప్ ఓషన్ మిషన్ సముద్రయాన్‌లో భాగంగా మత్స్య–6000 జలాంతర్గామిని రూపొందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ నౌకను చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ (ఎన్ఐఒటి) అభివృద్ధి చేసిందన్నారు. ఇది ప్రారంభమైతే దేశ తొలి మానవ సహిత సముద్ర అన్వేషణ మిషన్‌గా దీనికి గుర్తింపు దక్కనుందని పేర్కొన్నారు.

పక్షపాత ధోరణితో జగదీప్ ధన్‌ఖర్

- నిబంధనలకు విరుద్ధగా రాజకీయాలతో సభ నడుపుతున్నారు
- అందుకే ఆయనను తొలగించేందుకు అవిశ్వాసం
- విలేకరుల సమావేశంలో ప్రతిపక్షాలు

ధన్‌ఖర్ - ఖర్గే

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని, నిబంధనలకు విరుద్ధంగా రాజకీయాలతో సభ నడుపుతున్నారని ప్రతిపక్షాలు ధ్వజమెత్తాయి. ఆయన నిబంధనల కంటే రాజకీయాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని, అందుకే జగదీప్ ధన్‌ఖర్‌పై అవిశ్వాస తీర్మానం ఇచ్చామని ప్రతిపక్షాలు పేర్కొన్నాయి. బుధవారం నాడిక్కడ కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో ప్రతిపక్ష నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. రాజ్యసభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ.. ధన్‌ఖర్ ప్రభుత్వ అధికార ప్రతినిధిగా పనిచేస్తున్నారని, అనుభవజ్ఞులైన ప్రతిపక్ష నేతలను సభలో మాట్లాడకుండా తరచూ అడ్డుకుంటున్నారని విమర్శించారు. "ఉపరాష్ట్రపతి పదవి రాజ్యాంగ బద్ధంగా రెండోది. ఇంతవరకు ఉపరాష్ట్రపతి పదవి నుండి తొలగించే తీర్మానం ఎన్నడూ తీసుకురాలేదు. ఎందుకంటే గతంలో అధికారంలో ఉన్న వారందరూ ఎప్పుడూ రాజకీయంగా లేరు. కానీ నేడు పార్లమెంటులో రాజకీయాలు జరుగుతున్నాయని చెప్పవలసి వచ్చింది. మేము నిరాశ చెందాం. అధికార పార్టీ సభ్యులు మాట్లాడినప్పుడు జోక్యం చేసుకోరు. అదే ప్రతిపక్ష సభ్యులు మాట్లాడితే వెంటనే జోక్యం చేసుకుంటారు. కొన్నిసార్లు తనను తాను ఆర్ఎస్ఎస్‌కు చెందిన వ్యక్తినని పేర్కొంటారు. నేతలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తున్నారు" అని ఖర్గే అన్నారు. "సభా నాయకుడు మాట్లాడినప్పుడు ఎంత అవకాశం ఇస్తారో, ప్రతిపక్షనేతగా తాను మాట్లాడినప్పుడు కూడా అంతే అవకాశం ఇవ్వాలి. అదే రూల్ చెబుతోంది. కానీ ఛైర్మన్ అలా చేయరు. అతని ప్రవర్తన దేశ గౌరవాన్ని దెబ్బతీసింది. పార్లమెంటరీ ప్రజాస్వామ్య చరిత్రలో ఆయన అలాంటి పరిస్థితిని తెచ్చిపెట్టారు. అందుకే అవిశ్వాసం తీర్మానం తీసుకురావాల్సి వచ్చింది' అని అన్నారు. 'ప్రతిపక్ష పార్టీలను బహిరంగంగా విమర్శించి, అధికార పక్షానికి అధికార ప్రతినిధిలా ప్రవర్తించే ఉపరాష్ట్రపతి మన చరిత్రలోనే తొలిసారి చూస్తున్నాం. గత మూడేళ్లుగా క్లిష్టమైన సమస్యలను లేవనెత్తడానికి సమయం ఇవ్వకుండా, సీనియర్ సభ్యులను సైతం తక్కువ చేసి మాట్లాడారు" అని ఖర్గే అన్నారు. "1952 నుండి ఉప రాష్ట్రపతి ఎన్నడూ రాజకీయాలలో పాల్గొనలేదు. అందుకే ఉపరాష్ట్రపతిని తొలగించే తీర్మానాన్ని ఆర్టికల్ 67 కింద తీసుకురాలేదు" అని అన్నారు.

నిష్పాక్షపాతంగా వ్యవహరించాలి: బికాష్ రంజన్ భట్టాచార్య

రాజ్యసభ ఛైర్మన్ నిష్పాక్షపాతంగా వ్యవహరించాలని, రాజ్యాంగ పరిషత్ చర్చలో కూడా ఇదే స్పష్టం చేశారని సిపిఎం రాజ్యసభ ఎంపి బికాష్ రంజన్ భట్టాచార్య పేర్కొన్నారు. ఛైర్మన్ ప్రతిపక్షాలను విమర్శిస్తున్నారని, ఆర్ఎస్ఎస్‌ను కీర్తిస్తున్నాడని విమర్శించారు. ఈ అవిశ్వాస తీర్మానాన్ని సంతోషంగా తీసుకురావటం లేదని, దుఃఖంతోనే తీసుకువస్తున్నామని అన్నారు. అయితే రాజ్యాంగం దాడికి గురవుతున్న పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో కీలకమైన తరుణంలో తాము అలా చేయవలసి వచ్చిందని అన్నారు. ఛైర్మెన్ అధికార పక్షం వైపు మొగ్గు చూపుతున్నారని, అందుకే ఈ తీర్మానానికి సిపిఎం మద్దతు ఇచ్చిందని తెలిపారు.

ఆయన సర్కస్ నడుపుతున్నారు: సంజయ్ రౌత్

ఛైర్మన్ ధన్‌ఖర్ నడుపుతున్నది రాజ్యసభను కాదని, సర్కస్ అని శివసేన ఎంపి సంజయ్ రౌత్ ధ్వజమెత్తారు. 'నేను నలుగురు ఛైర్మన్‌లను చూశాను. కానీ నేను ఇంతకు ముందెన్నడూ ఇలాంటివి చూడలేదు" అని అన్నారు.

ప్రజాస్వామ్య రక్షణకే : మనోజ్ ఝా

ఆర్‌జెడి ఎంపి మనోజ్ ఝా మాట్లాడుతూ ప్రజాస్వామ్య రక్షణ కోసమే తమ పోరాటమన్నారు. "మా ఈ ప్రయత్నం ఏ వ్యక్తికి వ్యతిరేకం కాదు. కానీ ఒక సంస్థ ఆలోచనలు, మాటలు, చర్యలలో దాని ప్రవర్తనను పునరుద్ధరించే ప్రయత్నం" అని అన్నారు.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి దెబ్బ': తిరుచ్చి శివ

డిఎంకె ఎంపి తిరుచ్చి శివ మాట్లాడుతూ సభలో ధన్‌ఖర్ వ్యవహరిస్తున్న తీరు ప్రజాస్వామినికి దెబ్బ అని అన్నారు. ఆయన ధోరణి అధికార పక్షానికి అనుకూలంగా ప్రతిపక్షానికి వ్యతిరేకంగా ఉందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఫౌజియాఖాన్ (ఎన్‌సిపి), జావేద్ అలీఖాన్ (ఎన్‌సిపి), సర్వరాజ్ అహ్మద్ (జెఎంఎం), నదిముల్ హక్ (టిఎంసి), సంతోష్ కుమార్ (సిపిఐ), కె.ఎం మణి (కేరళ కాంగ్రెస్), జాన్ బ్రిట్టాస్ (సిపిఎం) తదితరులు మాట్లాడారు.

ప్రతిపక్షాల వినూత్న ఆందోళన

(మొదటి పేజీ తరువాయి)

మెరుగుపడుతుందని మంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు.

సజావుగా నడపండి : స్పీకర్‌కు రాహుల్ వినతి

పార్లమెంటులో తనపై బిజెపి ఎంపీలు చేసిన అనుచిత వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ కోరారు. బుధవారం పార్లమెంట్‌లో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో సమావేశమయ్యారు. అనంతరం రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడుతూ, బిజెపి సభ్యులు తనపై చేసిన అవమానకర వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని. స్పీకర్‌ను తాను కోరానని అన్నారు. సభ సజావుగా జరగాలన్నదే మా లక్ష్యం. చర్చ జరగాలి. బిజెపి నాయకులు తనకు వ్యతిరేకంగా ఏమైనా చెప్పనీయండి. డిసెంబర్ 13న రాజ్యాంగ చర్చ జరగాల్సిందే. వాళ్లు అదానీపై చర్చకు సహేమిరా అంటున్నారు. వాళ్లు మాపై ఆరోపణలు చేసుకోనీయండి, కానీ సభ మాత్రం జరగాలని రాహుల్ అన్నారు.

'ద్రోహి' వ్యాఖ్యలపై ప్రియాంక ఫైర్

కాగా, రాహుల్ గాంధీని 'ద్రోహి' అంటూ సంబిత్ పాత్ర సంబోధించడాన్ని ప్రియాంక గాంధీ తప్పుపట్టారు. జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీలను సైతం ద్రోహులుగా మాట్లాడిన వ్యక్తులు రాహుల్ గాంధీని విడిచిపెడతారని తాము అనుకోలేమని, వాళ్లకు ఇదేమీ కొత్త కాదన్నారు. ప్రభుత్వమే అంతరాయం కలిగించడం సిగ్గుపడాల్సిన విషయమన్నారు.

'సంభాల్' బాధితులతో రాహుల్ సమావేశం

న్యూఢిల్లీ : సంభాల్ హింసాకాండ బాధితులు, వారి కుటుంబాలతో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సమావేశమయ్యారు. న్యూఢిల్లీలోని రాహుల్ నివాసం 10 జన్‌పథ్‌లో ఈ సమావేశం జరిగింది. వయనాడ్ ఎంపి, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. బిజెపి విద్వేష రాజకీయాల ఫలితంగానే సంభాల్ ఘటన జరిగిందని, ఇలాంటి ఘటనలు శాంతియుత సమాజానికి ప్రాణాంతకమని విమర్శి ంచింది. ఇలాంటి హింసాత్మక, ద్వేషపూరిత మనస్తత్వాన్ని మనమంతా కలిసికట్టుగా ప్రేమ, సోదరభావంతో ఓడించాలని పిలుపు నిచ్చింది. బాధితులందరికీ తాము అండగా ఉంటామని, వారికి న్యాయం కోసం పోరాడతామని స్పష్టం చేసింది. నవంబర్ 24న ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో హింసాకాండ చెలరేగిన సంగతి తెలిసిందే. ఈ నెల 4న సంభాల్‌లో బాధితుల్ని పరామర్శించడానికి వెళుతున్న రాహుల్, ప్రియాంకలను ఘాజీపూర్ సరిహద్దు వద్ద ఉత్తరప్రదేశ్ పోలీసులు అడ్డుకున్న సంగతి విదితమే.

సేవకుల్లా పనిచేయండి

(మొదటి పేజీ తరువాయి)

సూచించారు. గత పాలకులు పోర్టులు, సెజ్‌లు కూడా కబ్జా చేశారని, ఒకొక్క దానిని సరిదిద్దుతున్నామని చెప్పారు. కొన్నిసార్లు ఫలితాలు వెంటనే రాకపోవచ్చని, అలా అని నిరుత్సాహ పడకుండా పనిచేస్తే ఎప్పటికైనా అనుకున్నది సాధిస్తామని అన్నారు. పిడిఎస్ బియ్యం రీ సైక్లింగ్ చేసి కాకినాడ పోర్టు ద్వారా ఎగుమతులు చేస్తున్నారని, ఇటువంటి అక్రమ కార్యక్రమాలను నియంత్రించేందుకు అవసరమైతే పిడి యాక్ట్‌ను కూడా వినియోగించాలని అన్నారు.

13న విజన్–2047 ఆవిష్కరణ

స్వర్ణాంధ్ర విజన్ –2047ను ఈనెల 13న ఆవిష్కరిస్తున్నట్లు సిఎం చెప్పారు. రాష్ట్రం, జిల్లా, మండలం, పంచాయతీ స్థాయిలో విజన్ రూపొందించామని, దానికి అనుగుణంగానే పాలన సాగాలని అన్నారు. 15శాతం వృద్ధి రేటును లక్ష్యంగా పెట్టుకుని జిల్లాల కలెక్టర్లు ఫలితాలు రాబట్టాల్సి ఉంటుందన్నారు. 2022–23లో విశాఖపట్టణం జిడిపిఎస్ రూ.1,19,268 కోట్లు ఉండగా, అది 2028–29 నాటికి రూ.2,64,78 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు.

అరుదైన లోహాలను కొల్లగొట్టేందుకు మోడీ సర్కార్ కసరత్తు

- దిండిగల్ సభలో ప్రకాశ్ కరత్ విమర్శ

చెన్నయ్ : దేశ ప్రజలపై భారాలు మోపుతూ, ప్రకృతి సంపదను ధ్వంసం చేస్తూ దేశంలోని బడా కార్పొరేట్లకు అనుకూలమైన విధానాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమల్జేస్తోందని సిపిఎం సమన్వయకర్త, పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్ విమర్శించారు. దేశంలో అత్యంత అరుదైన ఖనిజాలను కూడా భూగర్భం నుంచి వెలికి తీసి ఆ సంపదనంతా కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు మోడీ సర్కార్ సిద్ధమైందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తమిళనాడులోని దిండిగల్ జిల్లాలో నిర్వహించిన బహిరంగసభలో ఆయన ప్రసంగించారు. మదురైలో టంగ్‌స్టన్ సహా దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో అత్యంత అరుదైన ఖనిజాలను తవ్వితీసి బడా కార్పొరేట్లకు కోట్లవర్షం కురిపించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల కార్యాచరణ ప్రకటించిందని, ఈ దుర్మార్గమైన విధానాన్ని ప్రజలందరూ తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. మదురైలో అరుదైన టంగ్‌స్టన్ ఖనిజ తవ్వకాలను చేపట్టాలనే నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల శాసనసభలో తీర్మానాన్ని ఆమోదించడాన్ని కరత్ ఈ సందర్భంగా స్వాగతించారు. కేంద్రం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను ఇతర రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు కూడా వ్యతిరేకిస్తూ తీర్మానాలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు జి రామకృష్ణ, కేంద్ర కమిటీ సభ్యులు యు వాసుకి తదితర నాయకులు పాల్గొన్నారు.

సిరియాలోకి చొచ్చుకెళ్తున్న ఇజ్రాయిల్

(మొదటి పేజీ తరువాయి)

నివారించేందుకే ఈ చర్యలని చెప్పారు. అసద్ పంథాను ఎవరు అనుసరించినా వారికి అసద్‌కు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. గత 48గంటల్లో 350కి పైగా వైమానిక దాడులకు ఇజ్రాయిల్ పాల్పడింది. సిరియాలోని వ్యూహాత్మక ఆయుధ నిల్వల కేంద్రాలను చాలావరకు ధ్వంసం చేసేశామని తెలిపింది. తీవ్రవాదుల చేతుల్లోకి ఆ ఆయుధాలు వెళ్ళకూడదనే ఉద్దేశంతోనే ఈ దాడులు జరిపామంటూ సమర్థించుకుంది. సిరియా నావికాదళానికి చెందిన రెండు నౌకాశ్రయాలపై ఒకేసారి క్షిపణి నౌకలతో దాడి చేశామని మిలటరీ తెలిపింది. సిరియాలో అసద్‌ను పదవీచ్యుతుణ్ణి చేసిన తర్వాత ఏర్పాటు చేసే 'సాల్వేషన్ గవర్నమెంట్'కు మహ్మద్ అల్ బషీర్ సారథ్యం వహిస్తారని హెచ్‌టిఎస్ నేత అబూ మహ్మద్ జొలాని ప్రకటించారు.

దేశాన్ని పునర్నిర్మిస్తాం : తాత్కాలిక ప్రధాని హామీ

సిరియాను మొత్తంగా పునర్నిర్మిస్తామని తాత్కాలిక కొత్త ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన బషీర్ హామీ ఇచ్చారు. అయితే నగదు సంక్షోభం తీవ్రంగా వుందని వ్యాఖ్యానించారు. లక్షల సంఖ్యలో ఉన్న శరణార్థులందరినీ వెనక్కి రప్పిస్తామని చెప్పారు. పౌరులందరికీ రక్షణ కల్పిస్తామని, మౌలిక సేవలందిస్తామని హామీ ఇచ్చారు. విదేశీ కరెన్సీ కొరత చాలా తీవ్రంగ